క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల పార్టీ సమావేశం

కోడూరు: వైఎస్సార్ సీపీ మండల పార్టీ సమావేశాన్ని సోమవారం కోడూరులో నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు ఆదివారం తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, యువనేత సింహాద్రి వికాస్‌లు పాల్గొంటారన్నారు. మండలంలోని 13 పంచాయతీలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశంలో పాల్గొనాలని మాధవరావు కోరారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ



అవనిగడ్డ: కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించిన గాజుల లాస్య తండ్రి మాజీ ఎంపీటీసీ గాజుల మురళీకృష్ణ(భుట్టో)ను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. దాతల ఆర్థిక సాయంతో కిడ్నీ మార్పిడి చేయించుకున్న లాస్య శనివారం మరణించగా ఆయన తండ్రి మురళీకృష్ణను సింహాద్రి పరామర్శించి మనోధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో సింహాద్రితో పాటు జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నాయకుడు గరికపాటి వెంకట కృష్ణారావు ఉన్నారు.

రైతులు పంటలకు బీమా చేయించుకోవాలి

మోపిదేవి: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు ఖరీఫ్ సాగులో తమ పంటలను బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.హెప్సిబారాణి తెలిపారు. బీమాతో తుఫాన్‌లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించడం, ఎంపిక చేసిన పంటను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులని వివరించారు. బీమా పథకాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ హెప్సిబారాణి కోరారు. పూర్తి వివరాలకు మండల వ్యవసాయ కార్యాలయం, సచివాలయంలోని గ్రామ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

అథ్లెటిక్స్ షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్



అవనిగడ్డ: స్థానిక విజ్ఞాన విహార పాఠశాల విద్యార్థిని సనకా హేమశ్రీ జోనల్ స్థాయి అథ్లెటిక్స్ షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్ సాధించినట్టు ప్రిన్సిపాల్ నాగసూర్యతేజ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్కూల్ ఆవరణలో విద్యార్థిని హేమశ్రీని ప్రిన్సిపాల్ అభినందించారు. వచ్చే నెలలో జరుగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో హేమశ్రీ పాల్గొననున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు తుంగల శ్రీనివాసరావు, అద్దంకి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. పలువురికి గాయాలు

పెడన: పట్టణంలోని తోటమూల సమీపంలోని ఓ వైన్‌షాపు వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరి తలకు, మరొకరికి కుడిచేయి గూడు జారింది. మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో వీరిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి, మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎవరూ అందుబాటులోకి రావడం లేదు. గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నిండాముంచిన గుర్రపుడెక్క, తూటికాడ

- గుండేరులో భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటికాడ
- జాడలేని గుత్తేదారు
- నీట మునిగిన పంట పొలాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



గుండేరు వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటికాడను చూపుతున్న అన్నదాతలు

దేవరకోట(ఘంటసాల): మండల పరిధిలోని దేవరకోట శివారు బిరుదుగడ్డ వద్ద గుండేరు డ్రెయిన్‌పై భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటికాడ రైతులను నిండాముంచింది. వేసవిలో తొలగించాల్సిన గుర్రపుడెక్క, తూటికాడను తొలగించకపోవడంతో పంట పొలాలు నీటమునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల సంక్షేమానికి పని చేస్తున్నామని ఆర్భాట ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన వర్షాలు పడకముందే ఇంత ఇబ్బందులు ఉంటే అధిక వర్షాలు పడితే తమ పరిస్థితి ఏమిటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. గుర్రపుడెక్క, తూటికాడను తొలగించేందుకు 200 హార్స్ పవర్ కలిగిన పొక్లెయిన్లతో పనులు ఒకేసారి చేపడితేనే సమస్య పరిష్కారం అవుతుందని, మొక్కుబడిగా చేస్తే విపత్తు తప్పదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. గుండేరు డ్రెయిన్‌పై ఉన్న వంతెన వద్ద భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటికాడను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. మండలంలో 400 ఎకరాల్లో నారుమడులు, నాట్లు వేసిన పొలాలు నీట మునిగిపోయాయని ఆయా రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



నీట మునిగిన నాట్లను చూపుతున్న రైతు రత్నగిరిరావు

పొలాలు ముంపునకు గురయ్యాయి..



గుండేరులో గుర్రపుడెక్క, తూటకాడ పనులు చేపట్టాలని ముందునుంచి చెబుతేనే ఉన్నాం. క్షేత్రస్థాయిలో పనులు సక్రమంగా జరగకపోవడంతో నేడు రైతులు సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పొలాలు ముంపునకు గురయ్యాయి. 24 గంటల్లో సమస్య పరిష్కరించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే ప్రజా ప్రతినిధులు, గుత్తేదారు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వేమూరి రత్నగిరిరావు, రైతు, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు, దేవరకోట

గుర్రపుడెక్కను తొలగించాలి..



రెండు రోజులుగా పొలాలు మునిగిపోయి రైతులు ఆందోళనలు చేస్తుంటే ఈ రోజు మొక్కుబడిగా చిన్న యంత్రంతో గుర్రపుడెక్క, తూటికాడ పనులు చేపట్టడం బాధాకరం. కొడాలి నుంచి మాజేరు వరకు గుండేరుపై ఉన్న అన్ని వంతెనల వద్ద 200 హార్స్ పవర్ కలిగిన పొక్లెయిన్లను ఏర్పాటు చేసి గుర్రపుడెక్కను తొలగించాలి. అప్పుడే సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుంది.

– హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు

రూ.27.29 లక్షలు ఏమయ్యాయి ?



గుండేరు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూటకాడ తొలగించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.27.29 లక్షల నిధులు ఏమయ్యాయి. కూటమి కార్యకర్తల జేబుల్లోకి వెళ్లాయా అనే అనుమానం కలుగుతోంది. ప్రమాదకరంగా గుర్రపుడెక్క, తూటికాడ పేరుకుపోతే గుత్తేదారు ఏమి చేస్తున్నారు. కనీసం ఒక లక్ష రూపాయలు ఖర్చుచేసినా ఇంత సమస్య వచ్చేది కాదు. రైతులు పూర్తిస్థాయిలో నష్టపోక ముందే చర్యలు తీసుకోవాలి.

– అద్దాద ప్రసాద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం



నాగపుట్టలో పాలుపోస్తున్న భక్తులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారుజాము నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళి శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు అలంకరణలు, సాయంత్రం స్వామివార్లకు పంచహారతులు, చతుర్వేద స్వస్తి తీర్థ ప్రసాద వినియోగం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అష్టోత్తర కలశాభిషేకం సంప్రదాయ పద్ధతిలో చేపట్టారు. అనంతరం స్వామివారికి లక్ష బిల్వార్చన, శాంతి కల్యాణోత్సవం వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు దంపతులు, ఎస్ఐ సత్యనారాయణ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో కార్తికేయుడు


విశ్వబ్రాహ్మణ పెడన శాఖ కార్యవర్గం ఎన్నిక

పెడన: ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పెడన విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పుల్లేటికుర్తి ఎస్వీ శ్రీనుబాబు, కోశాధికారి చిట్టూరి ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో స్థానిక శ్యామలనగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామిగుడి ప్రాంగణంలో పెడన విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. తొలుత విశ్వకర్మ జెండా ఆవిష్కరణ, పండిత గానాల రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మేళ్లమర్తి నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా పొన్నపల్లి గిరిశంకర్‌రావు, కార్యదర్శి పోలోజు రవికుమార్, సహాయ కార్యదర్శి ఆముదాలపల్లి నాగమల్లేశ్వరరావు, ట్రెజరర్ కోలవెన్ను దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కొండిపర్తి విజయ శంకర్, అలుగోజు శివరామకృష్ణ ప్రసాదు(ఉరివి సిద్ధాంతి)లను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి పెడన పట్టణంతో పాటు మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో జిల్లా కార్యవర్గ సభ్యులు

శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు



శాకంబరీదేవిగా గంగాభవానీ



శాకంబరీదేవిగా వేళ్లమ్మ

కోడూరు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం అమ్మవార్లను శాకంబరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కోడూరు ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న గంగాభవానీ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి వివిధ రకాల కూరగాయల మాలలతో పాటు ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలు, పండ్లతో ముస్తాబు చేశారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లింగారెడ్డిపాలెంలోని వేళ్లమ్మ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు.

ఇరాలి గ్రామంలోని అంకాలమ్మ, గంగానమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు గ్రామస్తులు ఆషాఢ సారెను సంప్రదాయబద్ధంగా సమర్పించారు. సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సారె సమర్పించారు. కోడూరు గంగాభవానీ అమ్మవారికి ఆర్యవైశ్యులు సారెను సమర్పించారు. లింగారెడ్డిపాలెం వేళ్లమ్మ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన వ్యాపారులు సీహెచ్.విజయభాస్కర్, అద్దంకి వేణుగోపాలరావు సహకారంతో సారెను అందించారు. జరుగువానిపాలెంలోని అంకాలమ్మ తల్లికి మహిళలు సారెను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పౌరాణిక నాటకాలను ఆదరించాలి

మచిలీపట్నంటౌన్: పౌరాణిక నాటకాలను నేటి తరం ఆదరిస్తూ కళాకారులకు ప్రోత్సాహకాన్ని అందించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. నాటకాలను చూడటం ద్వారా నేటి యువతకు చారిత్రక ఘట్టాలు ఎన్నో తెలుస్తాయన్నారు. పౌరాణిక నాటకాలను ప్రదర్శించే రామకృష్ణ నాట్య మండలి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మహతి కళా వేదికపై ఆదివారం రాత్రి వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. బాబాప్రసాద్ మాట్లాడుతూ 50 వసంతాలుగా మన సంస్కృతీని పరిరక్షిస్తున్న గొప్ప కళాకారుడు మండలి నిర్వాహకులు జగన్మోహనరావు అని కొనియాడారు. మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు మాట్లాడుతూ మానసిక ఆనందంతోపాటు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తూ సామాజిక చైతన్య స్ఫూర్తిని రగిలించినటువంటి రామకృష్ణ నాట్యమండలి కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షుడు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో రామకృష్ణ నాట్యమండలి చేసిన కార్యక్రమాలు అభినందనీయమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ.. సాంస్కృతిక వికాసంతో సమాజ వికాసం కలిగిస్తుందని అన్నారు. వైద్యుడు ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ కళలు ఆరోగ్యంతో పాటు సామాజిక చైతన్యాన్ని కలిగిస్తాయన్నారు. నాట్యమండలి నిర్వాహకుడు జొన్నలగడ్డ జగన్మోహనరావు మాట్లాడుతూ నా ఊపిరి ఉన్నంతవరకు పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూనే ఉంటానన్నారు. సభలో నాట్య మండలి కార్యదర్శి జొన్నలగడ్డ శ్రవణ్ కుమార్, మచిలీపట్నం రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షులు వేముల సూరిబాబు, భావ తరంగిణి అధ్యక్షులు భవిష్య, సామాజిక కార్యకర్త పివి ఫణికుమార్, కుటుంబ సభ్యులు జొన్నలగడ్డ సరస్వతి, సత్యవతి, శుభశ్రీ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

పురస్కారాల అందజేత..

మండలి 50 వసంతాల వేడుక సందర్భంగా ఐదుగురికి 'విశిష్ట కళా సేవక్ పురస్కారాలను బహూకరించి సత్కరించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ విడియాల చక్రవర్తికి(జంధ్యాల రాధాకృష్ణ స్మారక పురస్కారం), ప్రముఖ హార్మోనిస్ట్ కె.పరబ్రహ్మాచారికి(గుత్తికొండ కోటేశ్వరరావు స్మారక పురస్కారం), విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటికి(ఆధ్యాత్మికవేత్త జొన్నలగడ్డ సుబ్రహ్మణ్య శాస్త్రి స్మారక పురస్కారం), ప్రముఖ గాయని వై.రాధికా సుబ్రహ్మణ్యంకు(అయినంపూడి వెంకటేశ్వరరావు స్మారక పురస్కారం), ప్రముఖ రంగస్థలం నటులు పుప్పాల వీరాంజనేయులుకు(డీవీ సుబ్బారావు స్మారక పురస్కారం) బహూకరించి సత్కరించారు. వేడుకల్లో భాగంగా యువటూరి ప్రసాద్ బాబు చాణిక్యుడు ఏకపాత్రాభినయం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం బాల నాగమ్మ నాటకం నుంచి గాజుల కృష్ణమూర్తి నాయుడు, మార్కాపురం గజలక్ష్మి, మాయల పకీరు– సంగు సన్నివేశాన్ని అద్భుతంగా అభినయించి ప్రశంసలు అందుకున్నారు. తొలుత యువతీ, యువకులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

140 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మెరైన్ సీఐ వంశీకృష్ణ

కోనేరుసెంటర్: ఆరోగ్యమే మహాభాగ్యమని గిలకలదిండి మెరైన్ సీఐ కె.వంశీకృష్ణ తెలిపారు. గిలకలదిండి మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం గిలకలదిండి గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. శిబిరంలో గిలకలదిండి, బందరుకోట, గరాలదిబ్బ గ్రామాలకు చెందిన 140 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈసీజీతో పాటు 2 డీ ఎకో, షుగర్ పరీక్షలను నిర్వహించిన వైద్య బృందం పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన వైద్య సలహాలు అందజేశారు. శిబిరంలో విజయవాడకు చెందిన సెంటినీ ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు వి.జె.చంద్రబోస్, పరింకాయల మురళీ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు



చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్ ఆవరణలో ఆదివారం ఉచిత కంటి, హోమియో వైద్య శిబిరాలను నిర్వహించారు. కంటి వైద్యుడు మోహనరావు 70 మందిని పరీక్షించి వారిలో 20 మందిని కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. హోమియో వైద్యుడు మణికంఠ 75 మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసిన వారిని ఈ నెల 22వ తేదీన విజయవాడలోని అమరావతి కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయించనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. శిబిరాలను క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, ట్రెజరర్ జూపూడి కిరణ్, సభ్యులు దింటకుర్తి జ్యోతి, ఉరిమి సువర్చల, ఉరిమి రమేష్, తమ్మన సతీష్, మలిశెట్టి రాములు, నంబూరు కుసుమ, కూసరటి గుప్తా పర్యవేక్షించారు.

ఉప్పొంగిన గుండేరు.. ఆందోళనలో రైతులు



కొత్తమాజేరు వంతెన వద్ద ప్రవహిస్తున్న వరద

చల్లపల్లి: గుండేరు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క కదలకుండా అడ్డుపడటంతో నీరు ముందుకు ప్రవహించక ఒక్కసారిగా పోటెత్తింది. మండల పరిధిలోని కొత్తమాజేరు వంతెన వద్ద గుర్రపుడెక్క గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. దీంతో వంతెన పాదవునా ఉన్న డెక్క ముందుకు పోకపోవటంతో ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహానికి అడ్డుకట్టగా మారింది. దీనికారణంగా ఒక్కసారిగా నీటి మట్టం పెరిగిపోయి గుండేరు గట్టుల వరకూ చేరింది. వంతెన దిగువన 10 అడుగుల ఎత్తులో నీరు ఉంటే... వంతెన ఎగువ భాగానా 7 అడుగుల ఎత్తులో నీరు ముందుకు వెళ్లకుండా పైకివచ్చింది. వంతెనకు 12 కానాలు ఉండగా అవి అన్నీ పూడుకుపోయి కేవలం మూడు కానాల్లో మాత్రమే తూతూ మంత్రంగా నీరు ముందుకు పారుతుండటతో ఆయా ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ భాగాన క్రమంగా నీటి మట్టం పెరుగుతుండటంతో ఎక్కడ తమ పంట పొలాలు ముంపుకు గురవుతాయోనని కంగారు పడ్డారు. స్థానికంగా వర్షాలు పడకపోయిన ఎగువ ప్రాంతంలో ఉన్న బందరు కాలువ నుంచి నీటిని ఒక్కసారిగా గుండేరులోకి మళ్లించటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. అయితే సకాలంలో గుండేరు డ్రెయిన్‌లో గుర్రపు డెక్క నివారణా చర్యలు చేపట్టకపోవటం కూడా ఇందుకు కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఉదయం అధికారులు యుద్ధప్రాతిపదికన పొక్లెయిన్లు తెప్పించి కొత్తమాజేరు వంతెన వద్ద గుర్రపుడెక్క తొలగింపు చర్యలను చేపట్టారు.

అభాగ్యుల సేవకు అంకితమైన రక్షణ సైన్యం



చర్చి ఆవరణలో పతాకం ఎగురవేస్తున్న రక్షణ సైన్యం ప్రతినిధులు

నాగాయలంక: రక్షణసైన్యం(సాల్వేషన్ ఆర్మీ) నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో స్థానిక రాజేశ్వరి కాలనీ చర్చి ఆవరణలో సంస్థ ఇండియా సెంట్రల్ టెర్రిటరీ 130వ సంస్థాపన దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంస్థ పతాకాన్ని ఎగురవేసి వందనాలు సమర్పించారు. రక్షణ సైన్యం జిల్లా అధికారి(డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు మాట్లాడుతూ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న తెలుగు గడ్డపై 1895లో విజయవాడలో తొలుత స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్ ఈ సంస్థను ప్రారంభించారని, ప్రస్తుతం 700లకు పైగా గ్రామాల్లో దుర్భర స్థితిలో ఉన్న వేలాది మంది అభాగ్యుల సేవలకు తమ సంస్థ అంకితమై పని చేస్తోందన్నారు. సంస్థ మరింత ఉన్నతికి చర్చలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు మండలంలోని దీనదయాళపురం సంస్థకు చెందిన చర్చిలో రక్షణ సైన్యం పతాకం ఎగురవేశారు. యూత్ విభాగం జిల్లా అధికారి లెఫ్టినెంట్ డి.అనిల్, లెఫ్టినెంట్ డి.కోటేశ్వరమ్మ, గృహ సమితి మహిళలు, యవ్వనస్థులు, బాలవీరులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మధుమేహ దృష్టి లోప పరిశోధనలో శ్రీకాంత్‌కు డాక్టరేట్



చల్లపల్లి: మారుమూల గ్రామంలో పుట్టి ఒక వైపు వైద్య వృత్తిలో ప్రజలకు సేవచేస్తూనే మరో వైపు మధుమేహ దృష్టి లోపాలపై పరిశోధన చేసి మరో డాక్టరేట్ అందుకొని దివిసీమ ప్రాంతానికే గర్వకారణంగా నిలుస్తున్నారు డాక్టర్ మెడింపూడి శ్రీకాంత్. చల్లపల్లి మండలం, నిమ్మగడ్డలో సాధారణ రైతు కుటుంబానికి చెందిన ఆయన విజయవాడలో డయాబెటీస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో దీర్ఘకాలిక టైపు–2 మధుమేహ రోగులలో డయాబెటిక్ రెటినోపతికి సంబంధించిన బాహ్య, అంతర్గత ప్రమాద కారకాలు, జన్యు వ్యత్యాసాలపై డాక్టర్ ఎం.సుబ్బారావు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ అందుకున్నారు. వైద్య రంగంలో విశేష కృషి చేస్తున్న శ్రీకాంత్ ఎప్పటికప్పుడు తన పరిశోధనలను ఆవిష్కరిస్తూ ఇప్పటికే జాతీయస్థాయిలో మూడు అవార్డులను అందుకున్నారు. 2009లో ప్రొఫెసర్ ఎం.విశ్వనాథన్ గోల్డ్ మెడల్ అవార్డు, 2015లో డయాబెటీస్ ఇండియా–డయాబెటీస్ అవేర్నెస్ ఇనిషియేటివ్ అవార్డు, 2018లో ఆర్ఎస్ఎస్‌డీఐ, యుఎస్‌వీ ఎక్స్‌లెన్స్ ఇన్ డయాబెటీస్ కేర్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్‌ను గ్రామస్తులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ



భావదేవరపల్లిలో ఊరేగింపుగా తరలివస్తున్న గ్రామస్తులు



ఘంటసాలలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



పైడమ్మ అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న భక్తులు

అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల వ్యాప్తంగా ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వార్లకు ఆషాఢ సారెలను సమర్పించారు. పసుపు, కుంకుమ, పండ్లు, ఫలాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని సారెను అందజేసి, ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయాల్లో కోలాహలం నెలకొంది.

– నాగాయలంక/కృత్తివెన్ను/పెడన/ఘంటసాల/చల్లపల్లి



కృత్తివెన్ను మండలం సీతనపల్లిలో..